శ్రీరామ కృష్ణ భక్తా





శ్రీ యన్నం రామిరెడ్డి గారు

మోక్షప్రాప్తి : 27-04-2024

చిరుమామిళ్ళ, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా

మీ ఇంటనే పుట్టి, మీ ఆదరాభిమానములతో పెరిగి, మిమ్ము చేపట్టి, మీరు చూపిన ధర్మ మార్గంలో నడిచి,
మీరు ఈ రోజు జీవాత్మ నుంచి మోక్షం పొంది పరమాత్మలో ఐక్యం అయినారు,
మీ ప్రేమ ధర్మమార్గంలో త్వరలో మోక్షం ద్వారా ఆ పరమాత్మలో కలసెదము మరల.

ఓం పూర్ణమదః పూర్ణిమదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావ శిష్యతే
ఓం శాంతిః శాంతిః శాంతిః

ఇన్ని రోజులు మీ కష్ట సుఖాలలో తోడై నిలిచిన ప్రతి ఒక్కరికి నమః సుమాంజలి..

సహధర్మచారిణి : యన్నం కోటేశ్వరమ్మ

r & r infratech (I) Pvt. Ltd.

Cell : 90000 02485

కార్యక్రమం : ఈ రోజు ఉదయం 9:00 గం॥లకు చిరుమామిళ్ళ గ్రామంలో జరుగును.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

జనరల్ అబ్జర్వర్ భూరే సర్వేశ్వర్ నరేందర్



మాచర్ల రూరల్: పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలైన మంచినీరు, టెంట్‌తో పాటు విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించడంతో పాటు ఓటర్లకు ప్రశాంతమైన వాతావరణాన్ని అందించటంలో అధికారులంతా సమిష్టిగా పనిచేయాలని జనరల్ అబ్జర్వర్ భూరే సర్వేశ్వర్ నరేందర్, జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్యాం ప్రసాద్ కోరారు. శనివారం మండలంలోని కంభంపాడు, రాయవరం గ్రామాలలోని జెడ్పిహెచ్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసే ఓటర్లతో పాటు ముఖ్యంగా సిబ్బందికి మౌలిక వసతులను కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ ప్రజలకు ఓటింగ్ పై అవగాహన కల్పిస్తూ ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించి అక్కడ సిబ్బందితో చర్చించారు. పోలింగ్ సిబ్బందికి ఇబ్బంది లేకుండా సకాలంలో వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట తహశీల్దార్ మంజునాథరెడ్డి, మున్సిపల్ కమీషనర్ వెంకట్ దాసు, డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్ శర్మ, షేక్ బాషా తదితరులున్నారు.

వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



యడ్లపాడు: వేసవి సెలవుల్ని విద్యార్థులు తమ విలువైన కాలాన్ని వృధా చేసుకోకుండా జీవన నైపుణ్యాల మెరుగుకు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని తెలిపారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11వ తేదీ వరకు ప్రభుత్వం ప్రకటించిన వేసవి సెలవుల్లో ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో 1–10వ తరగతి విద్యార్థులు పలు కృత్యాలు చేసే విధంగా షెడ్యూల్‌ను రూపొందించింది. ఇందులో భాగంగా విద్యార్థులు శారీరక, మానసిక వ్యాయామం కోసం స్పోర్ట్స్ అండ్ గేమ్స్ యాక్టివిటీస్, అలాగే ఉయ్ లవ్‌రీడింగ్ ద్వారా పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందుతుందన్నారు. ఆయా కార్యక్రమాలను ఉమ్మడి జిల్లాను గుంటూరు, తెనాలి డివిజన్లను విభజించి వీటిపై అన్ని స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలకు అవగాహన కల్పించామన్నారు. ఆయా కార్యక్రమాల్లో తమ పిల్లలు పాల్గొనేలా పేరెంట్స్ బాధ్యత తీసుకోవాలని సూచించారు. డాన్స్, డ్రామా, మ్యూజిక్ వంటి అంశాల్లో తమ పిల్లలు ప్రదర్శించిన ఫోటోలను వాట్సాప్ ద్వారా పంపించాలన్నారు. ఆయా కార్యక్రమాల వలన విద్యార్థుల్లో మంచి ఆరోగ్యంతో పాటు నాయకత్వ లక్షణాలు, లైఫ్ స్కిల్స్, విలువలు, టీం వర్క్ వంటి అంశాలు మెరుగుతాయన్నారు. ఆయా కార్యక్రమాల్ని డైట్ కళాశాల లెక్చర్లు డాక్టర్ కె ప్రసాద్, సౌజన్య కోఆర్డినేటర్లుగా పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం



ఏడవ వార్డులో ప్రచారం చేస్తున్న డాక్టర్లు

నరసరావుపేట: పార్లమెంట్, అసెంబ్లీలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ వైఎస్సార్‌సీపీ డాక్టర్ విభాగానికి చెందిన పలువురు వైద్యులు శనివారం సాయంత్రం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. వెంకటరెడ్డినగర్ ఏడవ వార్డు, ప్రకాష్‌నగర్ 11వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చేసుకుంటే చేపట్టిన 17 మెడికల్ కళాశాలలు, హార్బర్లు, విశాఖపట్టణం విమానాశ్రయం నిర్మాణాలలాంటి పెండింగ్ కార్యక్రమాలన్నీ పూర్తవుతాయని ఓటర్లకు తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూస్తుంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని డాక్టర్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, పాలూరి శ్రీనివాసరెడ్డి, పల్లకి వేణుగోపాలరెడ్డి, నాయకులు కొమ్మసాని కమలాకరరెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు గేరా ధర్మారావు, సానికొమ్ము రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాజీ కౌన్సిలర్ వేలూరి సుబ్బారెడ్డి, షేక్. సర్దార్, నంద్యాల వెంకటేశ్వరరెడ్డి, మిట్టపల్లి చంద్రోశేఖర్ పాల్గొన్నారు.

చేసేదే చెప్తాం...చెప్పింది తప్పక చేస్తాం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



వేపకంపల్లి గ్రామంలో ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

కారెంపూడి: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మండలంలోని వేపకంపల్లి, బ్రహ్మనాయుడు కాలనీ, కాకానివారిపాలెం, రెడ్డిపాలెం, పెదకొదమగుండ్ల గ్రామాల్లో శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ప్రభుత్వ విప్ పీఆర్కేకు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. అన్ని గ్రామాలలో పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. మొదట వేపకంపల్లి ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజల అనంతరం వేపకంపల్లి గ్రామం నుంచి ఎమ్మెల్యే పీఆర్కే ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రచార వాహనంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. బ్రహ్మనాయుడు కాలనీలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం చేసిన కృషిని వివరించారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన విశ్వసనీయత కలిగిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గతంలో చంద్రబాబు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మేనిఫెస్టోను విస్మరించిన విషయం గుర్తించాలన్నారు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికి చేకూరిన లబ్ధిని గుర్తించి పెద్ద మనస్సుతో ఆశీర్వదించి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మళ్లీ ఆశీర్వదిస్తే ఈసారి పింఛన్ రూ 3,500, అమ్మ ఒడి రూ 17 వేలు, రైతు భరోసా రూ.16 వేలకు పెంచి ఇస్తామని ముఖ్యమంత్రి మ్యానిఫెస్టోలో ప్రకటించారని, చెప్పినవి తప్పక నెరవేర్చే సత్తా ఉన్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వాహనాలున్న ప్రతి ఒక్కరికీ వాహనమిత్ర ఇస్తారని, ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్‌లు, జిల్లాకు ఒక స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజి ఏర్పాటుతో పాటు చదువుకునే వారికి స్టైఫండ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వేపకంపల్లిలో ప్రచారం అనంతరం బ్రహ్మనాయుడు కాలనీ, కాకానివారిపాలెం, రెడ్డిపాలెం పెదకొదమగుండ్ల గ్రామాలలో ప్రధాన వీధుల్లో ప్రచార వాహనంపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు బొల్నేడి మురళి, మేకల శ్రీనివాసరెడ్డి, మందాళ్ల అంజిరెడ్డి, మాజీ మండల యూత్ అధ్యక్షుడు అల్లు వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ అల్లు వెంకటేశ్వరరెడ్డి, కొమ్మిరెడ్డి ఎర్రగురవారెడ్డి, మాజీ జెడ్పీటీసీ వలపా బాలస్వామి, రామదేని ఆంజనేయులుతో పాటు జెడ్పీటీసీ షేక్ షఫీ, బొమ్మిన అల్లయ్య, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, మండల యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పార్టీ నాయకులు

నేడు శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి రథోత్సవం

తరలిరానున్న వేలాది మంది భక్తులు

మాచర్ల : పట్టణంలోని వేంచేసియున్న శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి దేవాలయంలో ఆదివారం జరగనున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారిని, శ్రీదేవి భూదేవి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి రథోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం నుంచే వేలాది మంది భక్తులు శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయానికి చేరుకుని పూజా కార్యక్రమాలు జరుపుతారు. ఎంతో చారిత్రాత్మక దేవాలయం కావటంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రథోత్సవంలో పాల్గొంటారు. అందులో భాగంగా ఇప్పటికే సిద్ధం చేశారు. రథశిల్పులతోతయారు చేసిన ఈ రథం స్వామి వారి మహోత్సవం సందర్భంగా చైతన్య బహుళ పంచమి రోజున సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహాలను ట్రస్టు బోర్డు చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఐ సాంబయ్య, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉత్సవాలలో భాగంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. అర్చకులు అడిగొప్పల చెన్నకేశవాచార్యులు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని జరిపి తీర్ధ ప్రసాదాలు అందించారు. పలువురు సేవా సంఘాలు, బ్యాంకు, కెసిపి, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, సామాజిక సేవా సంస్థలు ఆధ్వర్యంలో దద్దోజనం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తారు.



శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి మూలవిరాట్



సిద్ధంగా ఉన్న రథం

మంద కృష్ణ మాటలకు మోసపోకండి

మాచర్ల: రాష్ట్రంలో మరోసారి మాదిగలను మోసం చేయడానికి మందా కృష్ణ మాదిగ ముందుకొస్తున్నారని, ఎక్కడో తెలంగాణాలో ఉండే మంద కృష్ణ ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి పల్లె తిరిగి చంద్రబాబుకు లోపాయికారిగా మద్దతు పలకడాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి వైఎస్సార్‌సీపీని గెలిపించాల్సిన బాధ్యత మాదిగలందరిపై ఉందని రాష్ట్ర మాదిగ మహాసేన అధ్యక్షులు కొరిటిపాటి ప్రేమ్ కుమార్, మాదిగ మహాసేన గౌరవ సలహాదారు మల్లవరపు రవిరాజ అన్నారు. శనివారం పల్నాడు జిల్లాలో పర్యటించిన మాచర్ల నియోజక వర్గంలో వందలాది మంది మాదిగలతో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మాదిగలను గుర్తించి ఆదరించి, అక్కున చేర్చుకుని హోంశాఖామంత్రి పదవిని మాదిగలకు కేటాయించిన నాయకుడు సీఎం జగన్ అన్నారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో సీఎం జగన్ మాదిగలకు మున్సిపల్, విద్యాశాఖ మంత్రి పదవులు ఇచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ మహాసేన తరపున ప్రతి నియోజక వర్గంలో సీఎం జగన్‌కు మద్దతు పలకాలన్నారు. మాచర్ల మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగలను గుర్తించి ఘనత జగన్‌దైతే, 40 ఏళ్ళ చరిత్రలో మాచర్ల మున్సిపాలిటీలో మాదిగలను మున్సిపల్ చైర్మన్ చేసిన ఘనత ప్రభుత్వ విప్ పిఆర్కేదే నన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు కూచిపూడి గోపి, ఉపాధ్యక్షుడు కంభంపాటి మోషే, జిల్లా నాయకులు కందుకూరి రత్నరాజు, అన్నారావు, మహిళా జిల్లా నాయకురాలు ఆదిరాల నాగమణి, డేవిడ్, నీలంరాజు, శ్రీనివాస్, రమేష్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మాదిగ మహాసేన అధ్యక్షులు కొరిటిపాటి ప్రేమ్‌కుమార్



పీఆర్కేకు మద్దతు పలుకుతున్న రాష్ట్ర మాదిగ మహాసేన అధ్యక్షులు కొరిటిపాటి ప్రేమ్‌కుమార్

ఓటు హక్కు వినియోగించుకునేలా రక్షణ కల్పించండి

పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): జరగబోయే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా రక్షణ చర్యలు కల్పించాలని మండలంలోని పలుదేవర్లపాడు గ్రామానికి చెందిన బీసీ, మైనార్టీ వర్గీయులు కోరుతున్నారు. మండలంలోని పలుదేవర్లపాడు గ్రామంలోని పోలింగ్ బూత్ నెం.239లో మొత్తం 960 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో సుమారు 425 మందికి పైగా కమ్మ సామాజిక వర్గం, 40 మంది రెడ్డి సామాజిక వర్గం, మిగిలిన 400 మంది బీసీ వర్గాలకు చెందిన ముస్లిం, వడ్డెర, యాదవ సామాజిక వర్గాలకు చెందిన ఓటర్లు ఉన్నారు. 425 మందిలో 400 కు పైగా టీడీపీ సానుభూతి పరులు కాగా, మిగిలిన వారంతా వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు. వారి నుంచి రక్షణ కల్పించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని గ్రామస్థులు బి.బాలసైదులు, వి.వెంకట్రావు, బి.సాంబయ్య, టి.వెంకట్రావు, ఎం.కోటేశ్వరరావు, వి.సైదావలి, బత్తుల మస్తాన్‌రావు, వై.బ్రహ్మయ్య, పి.పార్వతి, టి.మాధవి, కె. శ్రీనివాసరావు, వై.సునీత, వేముల మస్తాన్‌వలి మరి కొంతమంది కోరుతున్నారు.

తండ్రి గెలుపు కోసం కుమార్తె ప్రచారం



రాజుపాలెం : తండ్రి గెలుపు కోసం కుమార్తె శక్తి వంచన లేకుండా కృషి చేస్తోంది. ప్రచారంలో తనదైన శైలిలో దూసుకుపోతోంది. చొరవ తీసుకుని ప్రజలతో మమేకమవుతోంది. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి, సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు తనయ డాక్టర్ మనోజ్ఞ శనివారం పెదనెమలిపురి శివారు గ్రామమైన శ్రీనివాస్ నగర్‌లో ఇంటింటా తిరుగుతూ వైఎస్సార్ సంక్షేమ కరపత్రాలను పంపిణీ చేస్తూ ఎమ్మెల్యేగా అంబటి రాంబాబును, ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ఆమె వెంట సర్పంచ్ కొర్రకూటి వెంకాయమ్మశ్రీనివాసరావు, ఎంపీటీసీ కందులూరి నాగేశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ తాటికొండ అంకమ్మరాజు, నాయకులు సీతారామయ్య, వేలాద్రి పాల్గొన్నారు.

మళ్లీ జగనన్న సీఎం అయితేనే పేదలకు మేలు



రామాంజనేయపురంలో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న మహిళలు, కార్యకర్తలు

- పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- ఎమ్మాజీగూడెం, రామాంజనేయపురం, మన్నెసుల్తాన్‌పాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

బెల్లంకొండ: పేదలకు మంచి జరగాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని ఎమ్మాజీగూడెం, రామాంజనేయపురం, మన్నెసుల్తాన్‌పాలెం గ్రామాలలో శనివారం రాత్రి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఐదేళ్లలో నియోజకవర్గంలో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో నడిపించానన్నారు. బెల్లంకొండ–అమరావతి రోడ్డు త్వరలోనే పూర్తి కాబోతుందని చెప్పారు. బెల్లంకొండ మండలంలో సాగునీటి సమస్య తీర్చేందుకు పులిచింతల బ్యాక్ వాటర్ నుంచి నాగిరెడ్డిపాలెం చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీళ్లు తెచ్చి కెనాల్స్ ద్వారా బెల్లంకొండ, అచ్చంపేట, క్రోసూరు మండలాలకు సాగునీరు అందించడమే తన లక్ష్యం అన్నారు. పొరపాటున చంద్రబాబు అధికారంలోకి వస్తే జన్మభూమి కమిటీల అరాచకాలు మళ్లీ మొదలవుతాయని, ప్రజలు జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు.

రామాంజనేయపురంలో మౌలిక వసతులు కల్పించాం :

గత పాలకులు పట్టించుకోకుండా వదిలేసిన రామాంజనేయపురం గ్రామాభివృద్ధికి తాను ఎప్పుడూ కట్టుబడి ఉన్నానని నంబూరు శంకరరావు అన్నారు. రామాంజనేయపురం ప్రచారం అనంతరం మాట్లాడుతూ రామాంజనేయపురంలో అంగన్ వాడీ స్కూల్ ఏర్పాటు, పాఠశాల వంటివి తెచ్చానన్నారు. దశాబ్దాలుగా పట్టించుకోని పాఠశాల సమస్యను కేవలం 11 నెలల్లో పూర్తి చేశామన్నారు. అటవీ ప్రాంతంలో అనుమతులు కష్టమైనా అటవీ శాఖ అధికారులతో మాట్లాడి అనుమతులు తెచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, జడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ మరియదాసు, మాజీ ఎంపీపీ బద్దూరి చంద్రారెడ్డి, మర్రి ప్రసాదరెడ్డి, చింతారెడ్డి సాయిరెడ్డి, భద్రయ్య, సర్పంచ్‌లు తురకా కళ్యాణ్, శ్రీనివాసరావు, దారం వెంకటనరసమ్మ, రమణారెడ్డి, నాయకులు బొడ్డుపల్లి రాము, తులిశా నాయక్, వడ్డీకాసులు, రామకోటి, బత్తుల శ్రీను, మారం ప్రసాదరెడ్డి, బోనం వెంకటరామిరెడ్డి, మాటూరి చిట్టిబాబు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెప్పేదే చేస్తాం...చేసేదే చెబుతాం



జానపాడు రోడ్డులోని టిఫిన్ సెంటర్ వద్ద అట్టు వేసిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

- గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి
- కాసు మహేష్‌రెడ్డికి ఘన స్వాగతం పలికిన వ్యాపారస్తులు

పిడుగురాళ్ల: చెప్పేదే చేస్తాం..చేసేదే చెబుతామని వైఎస్సార్‌సీపీ గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గంగమ్మ తల్లి దేవాలయం నుంచి జానపాడు రోడ్డులోని వాసవీ కల్యాణ మండపం, ఎస్‌బీఐ బ్యాంక్ సెంటర్ వరకు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబులా అబద్ధపు హామీలిచ్చి ప్రజల మోసం చేయలేమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పేదే చేస్తాడని, చేసేదే ప్రజలకు చెబుతాడని, దానిని కూడా ప్రజలు నమ్ముతున్నారని అన్నారు. 15 సంవత్సరాల క్రితం పిడుగురాళ్ల పట్టణం అవతరించినా ప్రభుత్వాలు మారినా, నాయకులు మారినా ఎవరు పట్టించుకోలేదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ఎంతో మందికి వ్యాపారస్తులకు మేలు చేయడం జరిగిందన్నారు. ట్రాఫిక్ సమస్య లేక పోవడం వల్ల పిడుగురాళ్ల పట్టణం ప్రశాంతంగా ఉందన్నారు.

నూతన మేనిఫెస్టోతో ప్రజలు సంతోషం

ఆరోవార్డు బాబాపేటలో ప్రచారం చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి



ఆరోవార్డులో ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ప్రకటించిన నూతన మేనిఫెస్టోతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని ఆరో వార్డు బాబాపేటలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్ కుమార్ యాదవ్, తనను గెలిపించాలని కోరారు. ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు మరోమారు అందాలంటే సీఎం జగన్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని చెప్పారు.ఈసందర్భంగా మాట్లాడుతూ అమ్మ ఒడి రూ.15వేలు నుంచి రూ.17వేలు చేశారన్నారు. పింఛన్ రూ.3వేల నుంచి రూ.3500లకు పెంచారని, రైతు భరోసా రూ.85వేలకు పెంచారన్నారు. గతంలో ఈ వార్డులో తనకు 1000మెజార్టీ వచ్చిందని, ఈసారి కూడా తనకు వస్తుందన్నారు. పట్టణంలో ఈసారి కూడా వైఎస్సార్‌సీపీకే మెజార్టీ వస్తుందని, టీడీపీ అభ్యర్థి డాక్టర్ అరవిందబాబు ఎంత తప్పుడు ప్రచారం చేసినా గెలవడం కష్టమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మేకల చంద్రకిరణ్‌రెడ్డి, వార్డు నాయకులు మేలేరి మార్కు, షేక్ ఫజూర్, దుగ్గెంపూడి వేమారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ మాటే శాసనంగా భావిస్తాం



జగన్ ప్రకటించిన మేనిఫెస్టో చాలా అద్భుతంగా ఉంది. నేను ఏపీని సింగపూర్ చేస్తా..అమెరికా చేస్తా..లండన్ చేస్తానని చంద్రబాబులాగా మోసపూరితమైన మాటలు చెప్పలేదు. రాష్ట్ర బడ్జెట్‌ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఏదైతే చేయగలుగుతామో అవే చెప్పాడు. ఈ రోజు సామాన్య ప్రజల కుటుంబాలు బాగుపడ్డాయంటే అవి కేవలం జగనన్న ప్రవేశపెట్టి అమలు చేసిన పథకాల పుణ్యమే. జగనన్న ప్రకటించిన మేనిఫెస్టోలో పేదల ప్రయోజనాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. మేనిఫెస్టోలోని ప్రతి అంశం అచరణకు చాలా దగ్గరగా ఉన్నాయి..

మసీద్ రఫీ. ఆటో డ్రైవర్, దాచేపల్లి.

మోసం చేయటం చంద్రబాబు నైజం



నేను 25 ఏళ్ల పాటు టీడీపీలో క్రియాశీలకంగా పనిచేశా. కానీ చంద్రబాబు మాకు చెప్పేదానికి చేసే దానికి అసలు పొంతనే ఉండదు. ప్రజలకు మేలు చేస్తామని చెబుతాడే తప్ప వారి బాగుపడటం స్వతహాగా చంద్రబాబుకి ఇష్టం ఉండదు చంద్రబాబుదంతా ఒక మాయ ప్రపంచం. టీడీపీలో ఉండి ఎంతో నష్టపోయాను. జగనన్న సీఎం అయిన తరువాత ప్రజలకు చేస్తున్న సంక్షేమం చూపి చాలా సంతోషం అనిపించి ఈ పార్టీలో చేరాను. పేద ప్రజల పట్ల జగనన్నకి అభిమానం ఉండబట్టే వారి బాగుకోసం ఈ మేనిఫెస్టోను ప్రకటించాడు. పేద ప్రజలంతా జగనన్న వైపే ఉంటారు.

యలమల సత్యం. దాచేపల్లి

చంద్రబాబు మోసపూరిత హామీలు నమ్మం



చంద్రబాబు మోసపూరితమైన హామీలు నమ్మే స్థితిలో యువత లేదు. అమలు కానీ హామీలు ఇచ్చి వదిలేయడంలో చంద్రబాబునాయుడు దిట్ట. గతంలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి మాట తప్పిన నాయకుడు చంద్రబాబు. 2019 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి చూపించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టో బాగుంది. రానున్న ఎన్నికల్లో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుంటాం.

: కోట్ల వినోద్ కుమార్ రెడ్డి, గురజాల

రైతు భరోసా పెంచడం ఆనందదాయకం



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో రైతు భరోసా పెంచడం రైతులకు ఆనందదాయకం. గతంలో ఏ ప్రభుత్వం కూడా రైతుల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నెరవేర్చిన ఘనత ఆయనది. ఇచ్చిన మాట తప్పే ఘనత చంద్రబాబునాయుడుది. జగన్ పాలనలో రైతులంతా ఆనందంగా ఉన్నారు. రైతులు కళ్లలో ఆనందం సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యం.

పిక్కిలి సీతయ్య, రైతు పిన్నెల్లి

17 ఎకరాల జామ, శ్రీగంధం తోట దగ్ధం

- నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు
- డ్రిప్ పైపులతో సహా పూర్తిగా కాలిపోయిన వైనం
- రూ.30 లక్షల మేర నష్టం



పూర్తిగా కాలిపోయిన జామ,శ్రీగంధం చెట్లు

బెల్లంకొండ: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో 17 ఎకరాల్లో జామ, శ్రీగంధం, సుగంధ తోట దగ్ధమైన ఘటన మండలంలోని కందిపాడు గ్రామం శివారులో శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. మండలంలోని చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు యాసం అంకారావుకు చెందిన తోటకు పెట్టారు. శనివారం మధ్యాహ్న సమయంలో తోట తగలబడుతుండడంతో స్థానికులు గమనించారు. వెంటనే విషయాన్ని అంకారావుకు తెలియజేశారు. కాగా అప్పటికే దాదాపుగా పది ఎకరాలకు పైగా తగలబడింది. స్థానికులు మంటలను అదుపు చేయాలని ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. దీంతో 17 ఎకరాల తోట పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో అంకారావుకు చెందిన జామతోటతో పాటు తోటలో అంతర సాగుగా వేసిన శ్రీగంధం, సుంగంధ చెట్లు పూర్తిగా కాలిపోయాయి. పంటకు డ్రిప్ పైపులతో నీరు పెట్టేందుకు ఏర్పాటు చేసిన మోటార్లు, డ్రిప్ పైపులు కూడా పూర్తిగా కాలిపోయాయి. దాదాపుగా రూ.30 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. కాగా ఈ పని గుర్తు తెలియని ఆకతాయిలు చేశారా, కక్షతో కావాలని ఎవరైనా చేశారా అనేది తెలియాల్సి ఉంది. ఇదే నెల 5న గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు గుంజా కోటేశ్వరరావుకు చెందిన 4 ఎకరాల జామ తోట కూడా దగ్ధమైంది. కాగా ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు యాసం అంకారావు తెలిపారు.

విద్యార్థులను సమాజ సేవకులుగా తీర్చిదిద్దాలి

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్

తాడికొండ: జాతీయ సమైక్యత కోసం, సేవా భావంతో దేశానికి సేవ చేసేందుకు, మానవత్వం పెంపొందించేందుకు, సమగ్రాభివృద్ధికి స్కౌట్స్ అండ్ గైడ్స్ కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ చీఫ్ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ కోరారు. గుంటూరు జిల్లా తాడికొండలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏపీ రీజనల్ ట్రెనింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంపు, స్కౌట్స్ రెసిడెన్షియల్ క్యాంపు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నివాసం ఉండేందుకు కర్రలతో తయారు చేసిన టెంట్‌లు, గాడ్జెట్లు, ఫస్ట్ ఎయిడ్‌లో బ్యాండేజ్ కట్టు కట్టడం స్ట్రక్చర్ నిర్మాణం, తాళ్లతో వేసే ముడులు, మ్యాపింగ్ స్ట్రాటేజింగ్, ఎస్టిమేషన్, సిగ్నలింగ్, ప్రాక్టికల్ చేయడం వంటి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్స్ యూనిట్ మొదలు పెట్టాలని, దీని ద్వారా విద్యార్థులు లైఫ్ స్కిల్స్ నేర్చుకొని క్రమశిక్షణతో మెలగడంతో పాటు విద్యార్థి దశ నుంచే ప్రజలకు సేవచేయాలనే దృక్పథాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలోని క్యాంపు సైట్లను, తాడికొండ రీజనల్ ట్రెనింగ్ కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ క్యాంపునకు చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, గుంటూరు, ఎన్‌టీఆర్, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి 138 మంది విద్యార్థులు, 7 మంది స్కౌట్ ఎగ్జామినర్‌లు పాల్గొన్నారు. డైరెక్టర్ కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, కమిషనర్ రేంజర్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పయ్యావుల పార్వతి, జిల్లా విద్యా శాఖాధికారి, జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ పి.శైలజ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా ఎస్‌టీసీ షేక్ నజీర్, జిల్లా కార్యదర్శి ఎం.ఏడుకొండలు, క్యాంప్ ఆఫీసర్ దారం ప్రసాద్ పాల్గొన్నారు.


సాక్షి పల్నాడు

ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



ప్రద్యుమ్న రక్తదానం


లబ్బీపేట(విజయవాడ): రాష్ట్ర రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న శనివారం రక్తదానం చేశారు. విజయవాడ గాంధీనగర్‌లోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకును సందర్శించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 505.40 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.6200, మోడల్ ధర రూ.5000 వరకు పలికింది.

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రి సభను జయప్రదం చేయండి

వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం గుంటూరు జిల్లా పొన్నూరులో జరిగే బహిరంగసభలో పాల్గొననున్నారని, సభలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలులోని పార్టీ కార్యాలయంలో శనివారం అన్ని గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ 29వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు పొన్నూరు అంబేడ్కర్ సెంటర్‌లో జరిగే సభకు చేబ్రోలు మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో ద్వారా రానున్న ఐదేళ్ల కాలంలో ప్రతి ఒక్కరి జీవితం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు



నరసరావుపేటఈస్ట్: ఉపాధ్యాయుల సమష్టి కృషితో పది పరీక్ష ఫలితాలలో పల్నాడు జిల్లా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలలో పల్నాడు జిల్లా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించటాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డీఈఓ వెంకటేశ్వర్లును కలసి అభినందనలు తెలిపారు. డీఈఓ మాట్లాడుతూ పది పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం విధులలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా జిల్లాకు సముచిత గౌరవాన్ని సాధించటం ఉపాధ్యాయుల సహకారంతోనే సాధ్యమయిందన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించటంతో పాటు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మోహిద్దీన్‌సాహెబ్, బిఎం.సుభాని, వెంకట్రావు, గోవిందరాజులు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి నూజివీడుకు చెందిన భక్తులు రూ. లక్ష విరాళాన్ని శనివారం అందజేశారు. నూజివీడుకు చెందిన ఎస్‌వీపీఎస్ ఎంటర్‌ప్రైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన లక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి కుటుంబం ఆలయ అధికారులను కలిసి రూ. 1,00,116 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఏఈవో ఎన్.రమేష్‌బాబు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

బంగారు తాపడం పనులకు విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు శనివారం పలువురు భక్తులు విరాళాలను అందజేశారు. విజయవాడకు చెందిన టి. సత్యసాయిబాబారెడ్డి రూ. 1,01,116, హనుమంతు రాజేశ్వరరావు స్వప్న దంపతులు రూ. 1,01,116, బండి కళావతి ఆంజనేయులు రూ. 1,00,116 విరాళాలను ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.







ప్రచార పర్వం

జిల్లాలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. సత్తెనపల్లి, గురజాల, పెదకూరపాడు నియోజకవర్గాలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. నకరికల్లులో మంత్రి అంబటి రాంబాబు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇద్దరు చిన్నారులను చేతుల్లోకి తీసుకుని లాలిస్తూ ఓటర్లను ఆకర్షించారు. పిడుగురాళ్ల పట్టణంలో ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. మసీద్‌సెంటర్‌లోని జిరాక్స్ సెంటర్‌లో మహిళలతో ముచ్చటించారు. బెల్లంకొండ మండలం ఎమ్మాజిగూడెం, రామాంజనేయపురం గ్రామాల్లో పెదకూరపాడు ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావు ప్రచారం నిర్వహించారు. మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు.

నవ రత్నాలకు మరింత మెరుగు

● అమ్మలకు ఆనందం ● రైతుకు మరింత భరోసా ● వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం మేనిఫెస్టోను విడుదల చేశారు. నవ రత్నాలకు మరింత మెరుగుపెట్టారు. అమ్మ ఒడి పథకం ద్వారా తల్లులకు ఇచ్చే రూ.15,000ను పెంచుతూ రూ.17వేలు చేశారు. రైతులకు ఇచ్చే పెట్టుబడి సాయం రూ.13,500ను రూ.16 వేలకు పెంచి భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారి మాటల్లోనే....



ఆచరణ యోగ్యమైన వాటితోనే మేనిఫెస్టో

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సత్తెనపల్లి: మేనిఫెస్టో అంటే నిజమైన అర్థాన్ని తీసుకొచ్చిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో విడుదల సందర్భంగా శనివారం సత్తెనపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ గత ఎన్నికలకు ముందు విడుదల చేసిన మేనిఫెస్టోలో 99 శాతం వాగ్దానాలు నెరవేర్చారన్నారు. ఇదే చంద్రబాబునాయుడు 2014లో ఇచ్చిన ఏ వాగ్దానాన్ని అమలు చేయలేదన్నారు. ఆచరణ యోగ్యం కానీ హామీలతో ప్రజల మెప్పుపొంది మోసం చేసి ఓట్లు పొందాలని అనుకుంటున్నాడన్నారు. వైఎస్ జగన్ మేనిఫెస్టోలో పెట్టారంటే అది అమలవుతుందని అర్థమన్నారు.

చంద్రబాబు హామీలు నమ్మరు



చంద్రబాబు హామీలను మహిళలు నమ్మరు. ఓట్ల కోసమే హామీలు ఇస్తారు. కానీ జగనన్న చెప్పాడంటే ఖచ్చితంగా నూటికి నూరు శాతం అమలు చేస్తాడు. ఈసారి కూడా ఆయనే సీఎం. నేడు ప్రకటించిన మేనిఫెస్టో 100 శాతం అమలు తథ్యం. ముందుగా తేదీని తెలియపరచి, ఆ తేదీ నాడు మా ఖాతాలోకి నేరుగా నగదు జమ చేయటం జగనన్నకే సాధ్యం.

– కొప్పుల సుధారాణి, కంచరగుంట, దుర్గి మండలం

జగన్ చెబితే చేస్తాడు



సీఎం వైఎస్ జగన్‌పై మాకు అపారమైన నమ్మకం ఉంది. జగన్ ఏదైనా చెబితే చేస్తాడు. అందరి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని మేనిఫెస్టోను విడుదల చేశారు. ఇప్పటివరకు అమలు చేసిన పథకాలు మాకు ఎంతో మేలు చేశాయి. మళ్లీ పథకాలను కొనసాగిస్తూ మరికొన్ని పథకాలు అమలు చేస్తానని చెప్పటం మాకు సంతోషం కలిగించింది.

–సయ్యద్ మౌలాలీ, దాచేపల్లి

రైతు భరోసా సాయం పెంపు సంతోషం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో బాగుంది. రైతు భరోసా సాయాన్ని పెంచటం సంతోషంగా ఉంది. చంద్రబాబు చెప్పడం తప్ప అమలు చేయడు. జగన్ చెబితే చేస్తాడు.

–అన్నపురెడ్డి వేణుమాధవరెడ్డి, చాగంటివారిపాలెం, ముప్పాళ్ల మండలం

అన్ని వర్గాలకు ప్రాధాన్యం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పీఆర్కే



మాచర్ల: పేదల సంక్షేమం కోసం లక్షల కోట్లు ఖర్చు చేస్తూనే మరో వైపు రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో అన్ని వర్గాలకు ప్రాధాన్యం లభించిందని పేర్కొన్నారు. వైఎస్సార్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పేదల సంక్షేమం, ఇళ్ల స్థలాలు, ఇళ్లు, రైతు భరోసా, వాహన మిత్ర, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, సున్నా వడ్డీతోపాటు అనేక పథకాలతో లక్షలాది మందికి లబ్ధి చేకూరుతుందని అన్నారు. అమ్మ ఒడి రూ.15వేల నుంచి రూ.17వేలకు పెంచటం, ఆరోగ్యశ్రీ కింద రూ.25లక్షలు ఉచిత వైద్యం అందించటంతోపాటు మెరుగైన వైద్యం అందించేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. వృద్ధుల పింఛన్‌ను రూ.మూడు నుంచి రూ.3500లకు పెంచటం, రైతు భరోసా రూ.13,500 నుంచి రూ.16వేలు పెంచడం హర్షణీయమన్నారు. ఇవ్వగలిగింది మాత్రమే చెప్పారన్నారు. సీఎం జగన్‌కు, మాజీ సీఎం చంద్రబాబుకు మాటల్లో, చేతల్లో ఉన్న తేడాను గమనించాలన్నారు. పథకాలను ఇంటింటికి ప్రచారం చేసి జగన్‌కు అండగా ఉండాలని కోరారు.

అన్నదాతలకు వరం వైఎస్సార్ అగ్రి ల్యాబ్

● ఉచితంగా పరీక్షలు
● నకిలీలకు అడ్డుకట్ట
● మేలైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా
● జిల్లాలో ఏడు అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు



పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



వినుకొండలోని వైఎస్సార్ అగ్రి ల్యాబ్

వినుకొండ(నూజెండ్ల): విత్తనం మంచిదైతే పంట బాగుంటుంది.. దిగుబడులు బాగుంటేనే అన్నదాత ఆనందంగా ఉంటాడు... రైతుకు మేలు కర విత్తనాలు... కల్తీ లేని ఎరువులు అందుబాటులో ఉంటే మంచి దిగుబడులు సాధిస్తాడు. రైతుల కలలు సాకారం చేసేందుకు, నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల బారి నుంచి రైతును కాపాడి పైసా ఖర్చు లేకుండా ఉచితంగా సేవలు అందించుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైఎస్సార్ ఇంటిగ్రేటెట్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. 2019 డిసెంబరు 11వ తేదీన రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 70 నియోజకవర్గాల్లో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను రైతులకు అందుబాటులోకి తెచ్చింది. 13 జిల్లాల కేంద్రాల్లో రీజనల్ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారు. నూతనంగా ఏర్పడ్డ పల్నాడు జిల్లాలో 2021 జూలై 8న వైఎస్సార్ జయంతి రోజున ఐదు నియోజకవర్గాల్లో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ప్రారంభించారు. వినుకొండ, పిడుగురాళ్ల, నరసరావుపేట, పెదకూరపాడు, చిలకలూరిపేట నియోజకవర్గాల్లో నూతన ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయి. 2023 జూలై 8వ తేదీన నూతనంగా మాచర్ల, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో అగ్రి ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లా మొత్తం మీద ఏడు నియోజకవర్గాల్లో వైఎస్సార్ అగ్రి ల్యాబ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో అందుతున్న సేవలు

- విత్తన పరీక్షలు, నకిలీ ఎరువులు, పురుగు మందులు పరిశీలించడం.
- ఎరువులు, పురుగుమందుల నాణ్యతా ప్రమాణాల పరిశీలన
- ఆక్వా రైతులకు నీటి పరీక్షలు, ఆక్వా ఫీడ్ నాణ్యత పరీక్షలు నిర్వహించి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడం.
- రీజనల్ కేంద్రాల్లో భూసార పరీక్షలు, ఆర్‌టీపీసీఎల్ పరీక్షలు రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

206 విత్తన పరీక్షలు

సీఎం వైఎస్ జగన్ కృషి ఫలితంగా అన్ని నియోజకవర్గాల్లో అగ్రి ల్యాబ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. విశాఖ, తిరుపతి, అమరావతి, తాడేపల్లిగూడెంలలో రీజనల్ సెంటర్లు ఏర్పాటుచేశారు. సీడ్ జన్యూ పరీక్ష టెక్నాలజీ అందుబాటులోకి తెచ్చేందుకు రూ.850కోట్ల వ్యయంతో గుంటూరులో నూతనంగా ల్యాబ్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. వినుకొండలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో ఇప్పటివరకు 206 విత్తన పరీక్షలు, 116 ఎరువులు, 4 ఫార్మా శాంపిల్స్, మరో 4 ట్రేడ్ శాంపిల్స్ పరీక్షించి రైతులకు సూచనలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

సేవలు అభినందనీయం



వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌లో రైతులకు అందిస్తున్న సేవలు అభినందనీయం. గతంలో నకిలీ ఎరువులు, పురుగుమందులు, విత్తనాలతో చాలా మంది రైతులు నష్టపోయారు. అయితే నేను సాగు చేస్తున్న విత్తనాలను అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకొని నాణ్యమైన విత్తనాలు అని రుజువైన తరువాతే సాగు చేస్తున్నాను. రైతులందరూ అగ్రి ల్యాబ్ సేవలు ఉపయోగించుకుంటే ఎలాంటి నష్టం ఉండదు.

– గుంటకల అయ్యన్న, వేల్పూరు, శావల్యాపురం మండలం

రానున్న రోజుల్లో మరిన్ని సేవలు



రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పరీక్షలు నిర్వహించి నకిలీలకు చెక్ పెడుతూ సేవలు అందించడమే అగ్రి ల్యాబ్ ముఖ్యోద్దేశం. నియోజకవర్గ రైతులు వినుకొండ మార్కెట్‌యార్డులో నెలకొల్పిన అగ్రి ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల పరీక్షల కోసం శాంపిల్స్ తీసుకొచ్చి పరీక్షించి తెలుసుకోవచ్చు. రానున్న రోజుల్లో మరిన్ని సేవలు రైతులకు అందుబాటులోకి రానున్నాయి.

–పి.శివలీల, ఏఓ, వైఎస్సార్ అగ్రి ల్యాబ్, వినుకొండ

రాజకీయాలకు కేంద్రం తూబాడు

మూడు తరాల వారసత్వంతో కాసు కుటుంబం



నాదెండ్ల: రాజకీయ చైతన్యానికి పల్నాడు జిల్లా మారుపేరు. ఈ జిల్లాలోని తూబాడు గ్రామం రాజకీయ ఉద్దండులకు పుట్టినిల్లు. స్వాతంత్ర్యం రాకముందు నుంచే ఈ గ్రామం రాజకీయాలకు కేంద్రంగా ఉండేది. రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న కాసు కుటుంబ సభ్యులు ఈ గ్రామం వారే. కాసు బ్రహ్మానందరెడ్డి, కాసు వెంకటకృష్ణారెడ్డి, కాసు మహేష్‌రెడ్డిలు మూడు తరాల వారసత్వంతో రాజకీయాల్లో ముఖ్యులుగా ఉన్నారు. సౌమ్యులుగా, దూరదృష్టికలవారుగా, పేదల పక్షపాతులుగా వీరి కుటుంబానికి ప్రజల్లో మంచి పేరుంది. గ్రామానికి చెందిన కాసు బ్రహ్మానందరెడ్డి 1946లో మద్రాసు ప్రెసిడెన్సీ శాసనసభ్యునిగా పనిచేశారు. స్వాతంత్ర్యానంతరం 1952లో మద్రాసు రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. సీపీఐ అభ్యర్థి కోలా సుబ్బారెడ్డి చేతిలో పరాజయం పాలయ్యారు. 1955లో ఆంధ్ర రాష్ట్ర శాసనసభకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ఫిరంగిపురం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. నీలం సంజీవరెడ్డి, దామోదర సంజీవయ్య మంత్రివర్గంలో వివిధ శాఖల మంత్రిగా పనిచేశారు. 1964–71 వరకూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1974లో కేంద్ర మంత్రిగా సేవలందించారు. కాంగ్రెస్ టోపీ ధరించే కాసు బ్రహ్మానందరెడ్డి, తన టోపీని అటూ ఇటూ మార్చితే ఏదో రాజకీయ ఎత్తుగడ వేశారని ఆయన సన్నిహితులు భావించేవారు. రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీల వ్యక్తిగా వ్యవహరించిన ఆయన వారసుడిగా కాసు వెంకటకృష్ణారెడ్డి రాజకీయాల్లోకి వచ్చారు. నరసరావుపేట నుంచి శాసనసభ్యునిగా, ఎంపీగా వ్యవహరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో 2007–09 వరకూ రాష్ట్ర మంత్రిగా వ్యవహరించారు. 2010–14లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో సహకారశాఖ మంత్రిగా పనిచేశారు. ఈయన కుమారుడు కాసు మహేష్‌రెడ్డి గురజాల శాసనసభ్యుడిగా వైఎస్సార్ సీపీ నుండి గెలుపొందారు. ప్రస్తుతం జరుగుతున్న సాధారణ ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి బరిలో నిలిచారు. కాసు బ్రహ్మానందరెడ్డి కాలంలో ఆయన సతీమణి రాఘవమ్మ సలహా మేరకు తూబాడు గ్రామంలో పేదలకు ఐదు సెంట్ల చొప్పున స్థలాలను పంపిణీ చేశారు. ఈ విషయాన్ని స్ఫూర్తిగా తీసుకున్న అప్పటి కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం, దేశవ్యాప్తంగా పేదలకు ఇంటి పట్టాలిచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెబుతుంటారు.



కాసు బ్రహ్మానందరెడ్డి
మాజీ ముఖ్యమంత్రి



కాసు వెంకట కృష్ణారెడ్డి
మాజీ మంత్రి



కాసు మహేష్‌రెడ్డి
గురజాల ఎమ్మెల్యే

బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహిస్తున్న చైత్రమాస బ్రహ్మోత్సవాలు శనివారంతో పరిసమాప్తమయ్యాయి. 19వ తేదీన ఉత్సవాలు ప్రారంభమవగా.. 24న పూర్ణాహుతి జరిగింది. 25 నుంచి మూడు రోజులపాటు మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని అద్దాల మండపంలో దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు పవళింపు సేవ నిర్వహించారు. చివరి రోజైన శనివారం రాత్రి ఉత్సవ మూర్తులకు పూజా కార్యక్రమాలను నిర్వహించిన ఆలయ అర్చకులు, వేద పండితులు సేవను జరిపించారు. సేవలో ఆలయ ఈవో కేఎస్ రామారావు, వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు పాల్గొన్నారు.

నీటిగుంతలో పడి ఇద్దరు మృతి

● మరో చిన్నారిని కాపాడిన స్థానికులు
● వేసవిసెలవులకు మేనమామ ఇంటికి వచ్చిన చిన్నారులు
● సొంత గ్రామాలకు తరలింపు



వేణుగోపాల్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి, అక్క

పెదకూరపాడు: సరదగా ఈతకు వెళ్లి నీటి గుంతలో పడి ఇద్దరు మృతి చెందగా మరొకరిని స్థానికులు కాపాడారు. మృతులు ఇద్దరు అక్క, చెల్లి బిడ్డలు కావడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. పెదకూరపాడు మండలం కన్నెగండ్ల గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కన్నెగండ్ల గ్రామానికి చెందిన బత్తుల ప్రకాష్‌కు నలుగురు తోబుట్టువులు. మూడో చెల్లి నరసమ్మను పెదకూరపాడుకి చెందిన మేనమామ కుమారుడు పమిడిపల్లి చిన్న వెంకటేశ్వర్లుకి ఇచ్చి వివాహం చేశారు. నాలుగో చెల్లి హేమమ్మను సత్తెనపల్లి మండలం అబ్బూరుకి చెందిన బుల్లేద్దుల క్రీస్తుబాబుకు ఇచ్చి వివాహం చేశారు. నరసమ్మకు శ్రావణి, వేణుగోపాల్ సంతానం. చిన్న చెల్లెలు హేమమ్మకు ధనుష్, ప్రశాంత్ అనే ఇద్దరు కుమారులు. నరసమ్మ కొంత కాలంగా అన్న ప్రకాష్ వద్దే ఉంటుంది. నాలుగు రోజు క్రితం హేమమ్మ కుమారులు వేసవి సెలవులకు మేనమామ ప్రకాష్ ఇంటికి వచ్చారు. చిన్నారులు ఆడుకుంటూ కాలనీకి కొంత దూరంలో ఉన్న అల్లిపరపు వాగు సమీపంలో ఉన్న నీటి గుంతలో ఈతకు ధనుష్ (13), వేణుగోపాల్(12), ప్రశాంత్‌లు ముగ్గురు కలిసి వెళ్లారు. ధనుష్, వేణుగోపాల్‌లు ముందుగా నీటి గుంతలో దిగారు. తరువాత ప్రశాంత్ దిగారు. ధనుష్, వేణుగోపాల్‌లు నీటిలో మునిగి పూడికలో కూరుకుపోయారు. ప్రశాంత్ బిగ్గరగా కేకలు వేయడంతో పక్కన గేదెల కాపర్లు వచ్చి కండువాల సహాయంతో ప్రశాంత్‌ను కాపాడారు. పక్కనే క్రేన్‌తో పనిచేస్తున్న షేక్ బాషా స్పందించి క్రేన్ సహాయంతో నీటి గుంతలో ఉన్న నీటిని తోడారు. స్థానికులు వచ్చిన గుంతలో వెతికి ధనుష్, వేణుగోపాలన్‌లు పూడికలో కూరుపోవడంతో బయటకు తీశారు. అప్పటికే వారు మృతి చెందారు.

తొలి బీసీ అభ్యర్థిగా విజయం చేకూర్చండి



వడియరాజుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్



ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, చైర్మన్ దేవళ్ల రేవతి

వడియరాజుల ఆత్మీయ సభలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్

నరసరావుపేట: నరసరావుపేట పార్లమెంటు చరిత్రలో తొలిసారి బీసీ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు వడియరాజులతో పాటు అందరూ మద్దతు పలికి విజయం చేకూర్చాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ కోరారు. శనివారం స్థానిక పెద్దచెరువులోని కాసు కన్వెన్షన్‌హాలులో జిల్లా వడ్డెర సంక్షేమ బోర్డు సభ్యుడు వేముల శివ అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి వడియరాజుల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ల రేవతితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర రాజకీయాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశం తర్వాత చాలా రంగాల్లో బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. చట్ట సభలు ఎరుగని కొన్ని కులాలకు చెందిన వ్యక్తులకు రాజ్యసభ, పార్లమెంటు, శాసనసభ, శాసనమండలికి పంపించారన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో బీసీలకు సీఎం జగన్ 48మందికి ఎమ్మెల్యే గా పోటీచేసే అవకాశం ఇవ్వగా చంద్రబాబు 32మందికే ఇచ్చారన్నారు. ఎప్పుడూ రాని గుంటూరు మిర్చి మార్కెట్ యార్డు చైర్మన్ పదవి బీసీ వర్గీయుడైన చంద్రగిరి ఏసురత్నంకు అవకాశం ఇచ్చారన్నారు. 190 కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో 56 కార్పొరేషన్లు బీసీలకే ఇచ్చారన్నారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే స్థానాలు మరో 50 పెరిగి 225 అవుతాయని, వీటిలో మరో 20సీట్లు బీసీలకు దక్కుతాయన్నారు. వీటిలో వడియరాజులకు ఒక ఎమ్మెల్యే స్థానం లభిస్తుందని చెప్పారు. ఇక్కడ ఎంపీగా పోటీచేసిన వ్యక్తికి ఈ సీటు బీసీకి ఇవ్వాలని, నీవు గుంటూరు నుంచి పోటీ చేయమని చెబితే అతను పార్టీ మారి ఇప్పుడు బీసీల మధ్యనే చిచ్చుపెడుతున్నారన్నారు. అందరూ సహకరిస్తే పార్లమెంటులో బీసీ జెండా ఎగురవేస్తానని అన్నారు. కోటప్పకొండలో వడియరాజుల సత్ర నిర్మాణానికి తాను పార్లమెంటు అభ్యర్థిగా గెలిచి తొలి ఏడాదిలోనే తనకు వచ్చే ఎంపీ నిధుల్లో రూ.50లక్షలు అందచేస్తానని హర్షధ్వానాల మధ్య హామీ ఇచ్చారు.

బీసీలంతా ఐకమత్యంగా ఉండాలి

ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

బీసీలంతా ఐకమత్యంగా ఉంటే సాధించుకోలేనిది ఏమీ లేదని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పార్టీ అని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గంలో వడియరాజుల ఓట్లు పురపాలక సంఘంలో 8,776, నరసరావుపేట రూరల్ పరిధిలో 4,181, రొంపిచర్ల మండలంలో సుమారుగా 4700తో మొత్తం 17,800ఓట్లు ఉన్నాయని చెప్పారు. పార్టీలను శాసించే శక్తి నియోజకవర్గంలో వడియరాజులకు ఉందన్నారు. తొలిసారిగా రొంపిచర్ల మార్కెట్‌యార్డు చైర్మన్ పదవిని వడియరాజులకు చెందిన బత్తుల రామకృష్ణకు ఇచ్చామన్నారు. టీడీపీ హయాంలో ఓసీలకు తప్పితే మరెవరికీ ఇవ్వలేదని, సీఎం జగన్ వచ్చిన తర్వాత మార్కెట్ యార్డు చైర్మన్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు, దేవాదాయ కమిటీల్లో ఐదు గురు బీసీలకు ఇవ్వాలని చెప్పారన్నారు. రొంపిచర్ల మండల వైస్ ఎంపీపీగాను, తన సొంత గ్రామంలోని బుచ్చిబాపన్నపాలెంలో ఉన్న రెండువేల ఓట్లలో 680ఓట్లు వడియరాజులవి ఉన్నాయన్నారు. పార్లమెంటు, అసెంబ్లీల్లో రిజర్వేషన్లు లేని బీసీలకు సీఎం జగన్ 25 ఎంపీ స్థానాల్లో 11 స్థానాలు బీసీలకు కేటాయించారన్నారు. రాజ్యసభకు ఎనిమిది మందిలో నలుగురిని బీసీలకు ఇచ్చారన్నారు. మంత్రుల్లో 27మందిలో 17మందికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అన్నారు. నెల్లూరు నుంచి వచ్చిన ఎంపీ అనీల్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత బీసీలపైనే ఉందన్నారు. వడ్డెర్లకు చెందిన కమ్యూనిటీ హాలు రూ.25లక్షలతో అభివృద్ధి చేశామని, కోటప్పకొండ సత్రానికి సహాయం చేస్తామన్నారు. వడ్డెర ఓబన్న విగ్రహం పట్టణంలో ఏర్పాటుచేస్తామన్నారు. జగనన్నతో పాటు ఎంపీ అనీల్, తనను గెలిపించుకునేందుకు వడ్డెర్లు సిద్ధంగా ఉండాలని కోరారు.

వడ్డెర్లకు రాజకీయ గుర్తింపు

ఎమ్మెల్సీ ఏసురత్నం

ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ వడ్డెర్లకు రాజకీయ గుర్తింపు ఇచ్చింది సీఎం జగన్ అని, ఆయనకు ధన్యవాదాలు చెప్పారు. ఎమ్మెల్యేగా తాను ఓడితే వెంటనే ఎమ్మెల్సీ ఇచ్చాడన్నారు. గుంటరు మిర్చి యార్డు చరిత్రలో మూడున్నరేళ్ల పాటు తనకు అవకాశం ఇచ్చినందుకు సంతృప్తిగా ఉన్నానని పేర్కొన్నారు. రాష్ట్రం మొత్తం 200మందికిపైగా వడ్డెర్లకు అవకాశం ఇచ్చాడని అన్నారు. ఇప్పటివరకు వడ్డెర సంఘీయులకు చంద్రబాబు చేసిందేమీలేదన్నారు. వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ రేవతి మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా ఏసురత్నంను ఎమ్మెల్సీగా చూస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు వడియరాజుల దెబ్బ చూపిస్తామన్నారు. యాదవ రాజులకు తోడుగా వడియరాజులు కలిస్తే టీడీపీకి చుక్కలు కన్పిస్తాయన్నారు. తాను రాజకీయంగా ఎదిగేందుకు ఎమ్మెల్యే గోపిరెడ్డి సహకారం మరువలేనిదన్నారు. జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డితో పాటు పలువురు వడ్డెర నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో రొంపిచర్ల మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు అచ్చి శివకోటి, మాజీ కౌన్సిలర్లు శివరాత్రి అంకమ్మరావు, బత్తుల లక్ష్మీపద్మలత, పట్టణ వడియరాజుల సంఘ అధ్యక్షుడు చల్లా హనుమంతరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేష్, వల్లెపు కోటయ్య, పల్లపు అంజయ్య, నాగూర్‌వలి, చేపల శ్రీను, శివరాత్రి శంకర నారాయణ, చపారపు గోపాలరెడ్డి పాల్గొన్నారు.

యువత చూపు...వైఎస్సార్‌సీపీ వైపు

- సంక్షేమ రథసారథికి యువత జై
- సంక్షేమ ప్రభుత్వం పట్ల యువత ఆసక్తి
- విద్యాదీవెన, వసతిదీవెనతో యువతకు అండగా నిలిచిన జగన్
- 2.35లక్షల ఉద్యోగాలతో నిరుద్యోగం నుంచి బయటపడిన యువత
- జగన్ పనితీరుపట్ల యువతలో క్రేజ్
- బాబు మాయకూటమిని అసహ్యించుకుంటున్న యువత

దాచేపల్లి : సంక్షేమ రథసారథికి జై కొడతామంటున్నారు యువత. ఏ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నా యువత ఓటర్లే కీలకంగా ఉంటారు. ఐదేళ్లలో సంక్షేమం..అభివృద్ధి రాష్ట్రంలో పరుగులు పెట్టించి యువతలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రేజ్ సంపాదించుకున్నారు. మోసపూరితమైన హామీలు ఇచ్చి నిరుద్యోగ యువతీ, యువకులను మోసం చేసిన చంద్రబాబుని నమ్మేందుకు యువత ఇష్టపడటం లేదు. విద్యాదీవెన, వసతి దీవెన పథకాల ద్వారా లబ్ధిపొందిన యువత ఐదేళ్ల పాలనలో 2.35 లక్షల ఉద్యోగ అవకాశాలు పొందిన వారంతా జగనన్నకి తోడుగా నిలవాలని ఉవ్విళ్లూరుతున్నారు. వీరంతా రానున్న ఎన్నికల్లో సంక్షేమ రథసారధికి అండగా నిలవాలని భావిస్తున్నారు. తొలిసారి ఓటు హక్కు వచ్చిన వారిలో మెజారిటీ యువతీ, యువకులు సీఎం జగన్ మోహన్ రెడ్డికే బాసటగా నిలుస్తామని ఘంటపదంగా చెబుతున్నారు.

యువతకు అండగా నిలిచిన సీఎం జగన్ :

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనాలో చరిత్ర సృష్టించేలా ప్రభుత్వ పథకాలు ప్రవేశపెట్టారు. డిబిటి ద్వారా నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో నగదు జమ చేసి లంచాలు లేకుండా చేశారు. ఈ క్రమంలో సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో యువతకు అధిక ప్రాధాన్యత కల్పించారు. ఇంటర్ తరువాత పై చదువులు చదువుకునే నిరుపేదలైన యువత ఉన్నత చదువుల కోసం పూర్తిస్థాయిలో ఫీజులు చెల్లించారు. ఏడాదికి మూడు దఫాలుగా జగనన్న విద్యా దీవెన కింద తల్లుల ఖాతాల్లో ఫీజులను జమ చేశారు. కళాశాలలో చదువుకునే సమయాల్లో బోర్డింగ్, లాడ్జింగ్ ఖర్చుల నిమిత్తం ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ20వేల చొప్పున మూడు విడతల్లో చెల్లించారు. పేదల చదువులకు ఏ ఆటకం లేకుండా పూర్తిస్థాయిలో సీఎం జగన్ ఫీజులు చెల్లించి చేదోడుగా నిలబడటంతో వారంతా జగన్‌కి మద్దతుగా నిలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గురజాల నియోజకవర్గం పరిధిలో జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా 19,287 మంది విద్యార్థులకు రూ56,97 కోట్లు, జగనన్న వసతి దీవెన పథకం ద్వారా 16,631 మంది విద్యార్థులకు రూ 19,04 కోట్లు కలిపి మొత్తంగా రూ76,01 కోట్లు సీఎం జగన్ చెల్లించారు.

చరిత్ర సృష్టించిన ఉద్యోగాల కల్పన :

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత 2.35 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశారు. వీటిల్లో ప్రధానంగా 1.35 లక్షల సచివాలయ వ్యవస్థ ఉద్యోగాలను ఒకేసారి భర్తీ చేశారు. ఉద్యోగాలు లేక ఇళ్లలో మగ్గిపోతున్న నిరుద్యోగ యువతీ, యువతకు సచివాలయం ఉద్యోగాలు జీవం పోశాయి. అంతే కాకుండా పోలీసు, ఆరోగ్యశాఖతో పాటు ఖాళీగా ఉన్న ఇతర శాఖల్లోని ఉద్యోగాలను సైతం భర్తీ చేయడంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా వచ్చాయి. 2.35 లక్షల ఉద్యోగాలు ఇవ్వటం ద్వారా యువత సీఎం జగన్ వైపు చూస్తున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్ మోహన్ రెడ్డికి అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారు.

నిరుద్యోగ యువతను మోసం చేసిన చంద్రబాబు

మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని యువత భావిస్తున్నారు. 2014లో మోసపూరితమైన హామీలతో ప్రజలను, నిరుద్యోగులు, యువతను నిలువునా మోసం చేసి చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. సుమారుగా 600పైచిలుకు హామీలను ప్రజలకు ఇచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయటంలో ఘోరంగా విఫలమయ్యారని ప్రజలు మండిపడుతున్నారు. తాను అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తానని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అమలు చేస్తానని చెప్పి చేయలేదు. ఫీజు రీయంబర్స్‌మెంట్ పూర్తిస్థాయిలో ఇస్తామని చెప్తే నమ్మి ఓటేసిన యువతను సైతం వంచించారు. ఎంత ఫీజు ఉన్నా కేవలం రూ.35వేలు మాత్రమే అది కూడా విద్యార్థులను ఇబ్బందులు పెడుతూ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తానని చెప్పిన చంద్రబాబు 2019 ఎన్నికలకు మూడు నెలల ముందు తూ..తూ మంత్రంగా ఇచ్చి చేతులు దులుపుకున్నారు. చంద్రబాబు చేసిన మోసాలన్నీ యువత మెదడుల్లో కదలాడుతుండటంతో మరోసారి బాబు మాయాకూటమికి ఓటు వేయకూడదని యువత నిర్ణయించుకున్నారు.

సంక్షేమ రథసారథికి నా ఓటు



నిరుపేద కుటుంబానికి చెందిన నేను ఉన్నత చదువులు చదువుకోవడానికి సీఎం జగన్ నాకు సాయం చేశారు. జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన ద్వారా నాకు ఫీజులు చెల్లించటం వల్ల నేను డిగ్రీ చదువుకుంటున్నాను. నాకు మొదటిసారిగా ఓటు హక్కు వచ్చింది. నా కుటుంబం, నా బాగుకోసం అండగా నిలిచిన జగనన్నకే ఓటు వేస్తాను.

–మందా శైలజ, పొందుగల

మంచి జరిగింది..అండగా ఉంటా



సీఎం జగనన్న ప్రభుత్వం వలన నాకు, మా కుటుంబానికి మేలు జరిగింది. ఎంతో మంచి కూడా జరిగింది. ఇంతటి మేలు గత ప్రభుత్వాలో మేము ఎప్పుడూ చూడలేదు. మాకు ఇంటి స్థలం వచ్చింది. నేను చదువుకోవటానికి ప్రభుత్వం ఫీజులు చెల్లించింది. జగనన్న ఫీజులు చెల్లించకపోతే నేను చదువుకోవటం కష్టంగా ఉండేది. నాకు తొలిసారిగా ఓటు హక్కు వచ్చింది. మరో ఆలోచన లేకుండా సీఎం జగనన్నకే ఓటు వేస్తా.

– షేక్ మాబు సుభానీ, దాచేపల్లి

మాయకూటమిని యువత నమ్మటం లేదు



చంద్రబాబు చదువుకునే విద్యార్థులను, నిరుద్యోగులను అడుగడుగునా మోసం చేశారు. చదువుకునేందుకు ఫీజులు చెల్లించలేదు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి కూడా ఇవ్వలేదు. యువతతో పాటు నిరుద్యోగులను మోసం చేసిన చంద్రబాబు మాయకూటమిని మేము అసలు నమ్మడం లేదు. ఖచ్చితంగా గుణపాఠం చెబుతాం. 2.35 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన సీఎం జగనన్నకే నా మొదటి ఓటు వేయాలని భావిస్తున్నా.

– కొలా వరుణ్‌కుమార్‌రెడ్డి, నారాయణపురం

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

వినుకొండ(నూజెండ్ల) : స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వినుకొండ మండలం ఉమ్మడివరం గ్రామపంచాయతీ చెట్టుపల్లి గ్రామానికి చెందిన 15 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమపథకాలు, గ్రామాల్లో చేసిన అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి చేరికలు పెరిగాయన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే బొల్లా

వైఎస్సార్ సీపీలోకి చేరిన 20 కుటుంబాలు

వినుకొండ (నూజెండ్ల): స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణంలోని నూర్‌బాషా సంఘానికి చెందిన 20 కుటుంబాలు, వినుకొండ రూరల్ మండలం కుమ్మరిపాలెం నుంచి ఐదు కుటుంబాలు, నూజెండ్ల మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేసిన అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి చేరికలు పెరిగాయన్నారు.



కండువా కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు